


వరదరాజస్వామి ప్రాజెక్ట్

చంద్రన్నపైనే ఆశలు..!


శ్రీశైల దేవస్థానం

- ఐదేళ్ల వైసీపీ పాలనలో పడకేసిన అభివృద్ధి
- ఎక్కడికక్కడే నిలిచిపోయిన ప్రతిష్టాత్మక పథకాలు
- నీరుగారిపోయిన శ్రీశైలం మాస్టర్ ప్లాన్
- నత్తనడకన రూ.116.83 కోట్ల నాన్ అమృత్ వాటర్ స్కీం
- నిర్వీరమైన సిద్ధాపురం ఎత్తిపోతల పథకం
- అభివృద్ధికి నోచుకోని మహానంది దేవస్థానం
- నేడు శ్రీశైలానికి సీఎం చంద్రబాబు రాక

ఆత్మకూరు, జూలై 31:

శ్రీశైల దేవస్థానానికి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ద్వాదశ జ్యోతిర్లింగాలు, అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటైన శ్రీశైల క్షేత్రంతో పాటు తెలుగు రాష్ట్రాలకు వెలుగులను ఇచ్చే శ్రీశైలం జలాశయం, దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వు ఫారెస్టుగా పేరుగాంచిన నాగార్జున సాగర్-శ్రీశైలం టైగర్ ప్రాజెక్ట్ ఈ గుర్తింపును ఇనుమడింపచేశాయి. ఇవేగాక మరెన్నో చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రదేశాలతో శ్రీశైల నియోజకవర్గం ప్రత్యేకతను సంతరించుకుంది. ఇంత ప్రాధాన్యత ఉన్న ఈ నియోజకవర్గం అభివృద్ధి గత ఐదేళ్ల వైసీపీ పాలన వల్ల పడకేసింది. అనేక ప్రతిష్టాత్మక పథకాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. శ్రీశైలం దేవస్థానం అభివృద్ధికి నిర్దేశించిన మాస్టర్ ప్లాన్ ముందుకు సాగలేదు. ఆత్మకూరులో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చేపట్టిన నాన్ అమృత్ స్కీం, బీడు భూములను సస్యశ్యామలం చేయాలన్న సంకల్పంతో నిర్మించిన సిద్ధాపురం ఎత్తిపోతల పథకాలు నిరుపయోగమయ్యాయి. నియోజకవర్గంలోని మరో ప్రసిద్ధ క్షేత్రం మహానంది కూడా అభివృద్ధికి నోచుకోలేదు. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత చంద్రబాబు తొలిసారి శ్రీశైల నియోజకవర్గానికి వస్తున్నారు. గత టీడీపీ పాలనతో చేపట్టిన అభివృద్ధి పనులకు తిరిగి జీవం పోయాలని ప్రజలు కోరుకుంటున్నారు. అభివృద్ధిలో నియోజకవర్గాన్ని పరుగులు పెట్టించడంతో పాటు మరిన్ని హామీలతో శ్రీశైలం అభివృద్ధికి బాటలు వేయాలని ప్రజలు ఆశిస్తున్నారు.

నత్తనడకన నాన్ అమృత్ వాటర్ స్కీం

ఆత్మకూరు పట్టణ ప్రజలు దశాబ్దాల కాలంగా వేధిస్తున్న తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా 2019 ఫిబ్రవరి 18న టీడీపీ హయంలో రూ.116.83 కోట్లతో నాన్ అమృత్ స్కీం పనులను ప్రారంభించారు. ఈ పథకంలో భాగంగా వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి గుంతకందాల, వేంపెంట, బానకచర్ల, బానుముక్కల టర్నింగ్ మీదుగా కరివేన వరకు 22 కిమీల దూరంలో భారీ లైప్‌లైన్‌ను ఏర్పాటు చేయాలని భావించారు. అలాగే కరివేన వద్ద 2ఎకరాల స్థలంలో వీబీఆర్ నుంచి వచ్చిన నీటిని ఫిల్టర్‌బెడ్స్ ద్వారా శుద్ధిచేసేందుకు వివిధ నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించారు. అలాగే ఆత్మకూరులో ఐదు చోట్ల లక్ష లీటర్ల సామర్థ్యం గల ఈఎల్ఎస్ఆర్ ట్యాంకులను నిర్మించి పట్టణానికి నీటిసరఫరా అందించాలనే ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే ఐదేళ్లలో ఇప్పటివరకు ఒక్క వాటర్ ట్యాంకు నిర్మాణం కూడా పూర్తికాలేదు. అలాగే వీబీఆర్ నుంచి ఆత్మకూరుకు వచ్చే పైపులైన్ పనుల జోలికే వెళ్లలేదు. ఈ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తేనే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తోంది.

కలగానే బండిఆత్మకూరు-ఓంకారం డబుల్‌లైన్

గత టీడీపీ హయంలో బండిఆత్మకూరు - ఓంకారం మధ్య రూ.17కోట్లతో డబుల్‌రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి 20శాతం పనులు పూర్తిచేశారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక మిగిలిన పనులను వైసీపీ నాయకులు దక్కించుకుని ఇప్పటికీ పూర్తిచేయలేదు. అలాగే టీడీపీ హయంలో 18 కిలోమీటర్ల మేర తెలుగుగంగ కాల్వ లైనింగ్ నిర్మాణ పనులకు రూ.289కోట్ల నిధులను మంజూరు చేశారు. అయితే నేటికీ ఆ పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. తెలుగుగంగ లైనింగ్ పనుల పేరిట మూడేళ్లుగా ఆయకట్టు రెండో పంటకు నీరందించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అదేవిధంగా బండిఆత్మకూరుకు యర్రకుంట్ల ఊరుకి రోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో ఆయా గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు.


ఆత్మకూరులోని నాన్ అమృత్ స్కీం దుస్థితి ఇలా

అభివృద్ధికి నోచుకోని మహానంది దేవస్థానం

రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో మహానంది దేవస్థానం ఒకటి. అయితే ఐదేళ్ల వైసీపీ పాలనలో మహానంది దేవస్థానంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి జరగలేదు. ప్రాచీన ఆలయ నిర్మాణాలు నానాటికి దెబ్బతింటున్నాయి. ఈక్షేత్రానికి కూడా రోజురోజుకు భక్తుల రద్దీ పెరుగుతున్నప్పటికీ భక్తులకు సరైన సదుపాయాలు కల్పించలేని పరిస్థితులు నెలకొన్నాయి. అదేవిధంగా మహానంది - గాజులపల్లి మధ్యలో ఉన్న పాలేరువాగుపై వంతెన నిర్మాణం లేక ఇక్కడి ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలో అరటి పంటలను విస్తారంగా సాగుచేస్తారు. ఈనేపథ్యంలో అరటి రైతుల కోసం అరటి కోల్డ్ స్టోరేజ్ గోదామును నిర్మించాల్సిన అవసరం ఉంది.


మహానంది పుణ్యక్షేత్రం

నిర్వీర్యమైన సిద్ధాపురం ఎత్తిపోతల పథకం

ఆత్మకూరు, పాములపాడు మండలాల్లోని సుమారు 21300 ఎకరాల బీడుములకు సాగునీరందించేలా గత టీడీపీ ప్రభుత్వ హయంలో 2018 జనవరి 7వ తేదిన రూ.116.52 కోట్లతో సిద్ధాపురం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. అయితే ప్రస్తుతం ఈ పథకం పనితీరు అధ్వానంగా మారింది. తూము గేటు మరమ్మతులకు గురవడంతో పాటు మట్టికట్ట బలహీనపడి రంధ్రాలు పడ్డాయి. అదేవిధంగా మట్టికట్టపై అడవి పెరిగి ప్రమాదకరంగా మారింది. ప్రాజెక్ట్ నిర్వహణ పూర్తిగా గాలికి వదిలేయడంతో పాటు సుమారు రూ.74.75కోట్ల పెండింగ్ బిల్లులను చెల్లించాల్సి ఉంది. ఇందులో సుమారు రూ.63 కోట్లు విద్యుత్ బకాయిలే ఉన్నాయి. కాగా సిద్ధాపురం చెరువు నుంచి వెంకటాపురం, కృష్ణాపురం అమలాపురం, శ్రీపతిరావుపేట, ఇందిరేశ్వరం గ్రామాల్లోని సుమారు 4500 ఎకరాల అదనపు ఆయకట్టుకు నీరందించాల్సిన ప్రతిపాదనలు ఏమాత్రం ముందుకు సాగలేదు.


సిద్ధాపురం ఎత్తిపోతల పథకం

వీఆర్‌ఎస్పీని విస్మరించిన వైసీపీ ప్రభుత్వం

ఆత్మకూరు మండలంలోని మునిమడుగుల వాగుపై వరదరాజ స్వామి ప్రాజెక్ట్‌ను నిర్మించారు. ఈప్రాజెక్ట్ ద్వారా ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల్లోని 13 గ్రామాల్లోని సుమారు 12,092 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందాల్సి ఉంది. ఈక్రమంలోనే ప్రాజెక్ట్ నిర్వహణకు గత టీడీపీ హయంలో రూ.19.5కోట్ల జైకా నిధులను మంజూరు చేశారు. అయితే వైసీపీ హయంలో ఈ పనులు జరిగినప్పటికీ ఎలాంటి పురోగతి కనిపించలేదు. పనుల్లో భారీగా అవకతవకలు జరిగినట్లు విమర్శలున్నాయి. దీంతో ప్రాజెక్ట్ నిర్వహణ నేటికీ మెరుగుపడలేదు. ఈ పరిస్థితుల్లో ప్రాజెక్ట్ నిర్వహణను గాడిలోకి తెచ్చి శ్రీశైలం జలాశయం నుంచి వీఆర్‌ఎస్పీ ప్రాజెక్టుకు ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేస్తే ప్రతిఏటా ఆయకట్టుకు నీరందించే అవకాశం ఏర్పడుతుంది. ఈదిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

నీరుగారిపోయిన శ్రీశైలం మాస్టర్ ప్లాన్

గత టీడీపీ హయంలో శ్రీశైల క్షేత్రాన్ని మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా సుమారు రూ.350కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. వాస్తవానికి ఇటీవల కాలంలో శ్రీశైలానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భారీగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ నేపథ్యంలో శ్రీశైల క్షేత్రం మరింతగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉంది. అయితే ఐదేళ్ల వైసీపీ హయంలో శ్రీశైలంలో చెప్పుకోదగ్గ ఎలాంటి అభివృద్ధి జరగలేదు. పైగా శ్రీశైలంలో కొంతమంది వైసీపీ నాయకులు అందినకాడిని దోచుకున్నారు. తమకు ఉన్న రాజకీయ అండదండలతో శ్రీశైలంలో ఏపని జరగాలన్న రేట్ ఫిక్స్ చేసి దండుకున్నారు. ప్రత్యేకించి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నియామకాల్లో కోట్ల రూపాయలు అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. సున్నిపెంటకు సంబంధించి వాటర్ స్కీం పథకానికి టీడీపీ హయంలో రూ.17కోట్లను మంజూరు చేస్తే వైసీపీ వచ్చాక పనులు నిలిచిపోయాయి. అలాగే సున్నిపెంట, లింగాలగట్టులో పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించి మౌలిక సదుపాయాలను కల్పించాల్సి ఉంది. సున్నిపెంటలోని ప్రాజెక్ట్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యసేవలు కల్పించాలి.

టెంపుల్-టూరిజంపై దృష్టి సారించాలి

శ్రీశైల నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ పరిశ్రమలు లేకపోవడంతో ఇక్కడ ఉపాధి అవకాశాల్లేక యువత ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని శ్రీశైలం, మహానంది, ఓంకారం తదితర ప్రముఖ పుణ్యక్షేత్రాలతో పాటు నల్లమల అడవులు, కృష్ణానది పరవళ్లు తదితర ప్రకృతి సంపదలను సద్వినియోగించుకుని టెంపుల్ టూరిజం కింద అభివృద్ధి చేస్తే ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంది. ఇందుకోసం నియోజకవర్గంలో పలుచోట్ల టూరిజం కేంద్రాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ప్రత్యేకించి నల్లమల చెంచు గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. ఇవేకాకుండా నియోజకవర్గంలో విద్య, వైద్యం, ఉపాధి కల్పనపై దృష్టి సారిస్తే ఇక్కడి ప్రజలకు మేలు జరుగుతుంది.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

బనగానపల్లె, జూలై 31: ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తానని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను మంత్రి స్వయంగా స్వీకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓపిగ్గా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించారు. మరికొన్ని అర్జీలను సంబంధిత అధికారులకు పంపి త్వరితగతిన పరిష్కరిచాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పార్టీకోసం అహర్నిశలు కష్టపడిన టీడీపీ కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటానని స్పష్టం చేశారు. టీడీపీ కార్యకర్తలు ఏ సమస్య వచ్చినా నేరుగా తనను సంప్రదించాలని కోరారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి బీసీ

టిడ్కో గృహాలను నాశనం చేసిన జగన్

- పెండింగ్ పనులు పూర్తి చేసి పేదలకు ఇస్తాం
- మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్
- మహిళా మార్ట్ నిర్మాణానికి శంకుస్థాపన

నంద్యాల టౌన్, జూలై 31: గడిచిన ఐదేళ్లలో పేదలకు అందాల్సిన టిడ్కో గృహాలను వైఎస్ జగన్ నాశనం చేశాడని మైనార్టీ సంక్షేమ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం టిడ్కో కాలనీలో రూ.1.66 కోట్లతో నిర్మించనున్న మహిళా మార్ట్‌కు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయంలో పేదలందరికీ నాణ్యమైన ఇళ్ళను అందించేందుకు టిడ్కో గృహాలను నిర్మించామన్నారు. అయితే 85 శాతం పూర్తి అయిన గృహాలను చంద్రబాబుకు మంచి పేరు వస్తుందన్న కక్షతో జగన్ నాశనం చేశాడన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నిటినీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. అధికారంలోకి వచ్చి కేవలం రెండు నెలలు కూడా కాలేదని, వైసీపీ నాయకులు తెలుగుదేశం ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేస్తుండటం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వానికి జనం ఓటుతో బుద్ధి చెప్పి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారని, అయినా ఆ పార్టీ నాయకులకు బుద్ధి రాలేదని ధ్వజమెత్తారు. నంద్యాల నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఫరూక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, టిడ్కో ఉమ్మడి జిల్లా ఎస్ఈ రాజశేఖర్, చైర్‌పర్సన్ మాబున్నీసా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్ ప్రసాద్, వైస్ చైర్మన్లు శ్రీధర్, పాంషావలి, టీడీపీ కౌన్సిలర్లు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌కు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఫరూక్



సీఎం పర్యటనకు భారీ బందోబస్తు


ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా


నంద్యాల క్రైం/శ్రీశైలం, జూలై 31: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం శ్రీశైలం పర్యటనకు వస్తున్న నేపథ్యంలో పటిష్ఠ బందోబస్తు చేపట్టినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎస్పీ సీఎం పర్యటించే ప్రదేశాలను ఆయన స్వయంగా పరిశీలించి భద్రతా చర్యలపై పోలీస్ అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీశైలం చేరుకున్నప్పటినుంచి తిరిగి వెళ్లే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సుమారు 1,100 మంది పోలీస్ అధికారులు, సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రదేశాలను 11 సెక్టార్లుగా విభజించినట్లు పేర్కొన్నారు. ప్రతి సెక్టార్‌కు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారిని, ఆపై డీఎస్పీ స్థాయి అధికారులను నియమించామన్నారు. సుండిపెంట హెలిప్యాడ్ నుంచి టెంపుల్ వరకు, హెలిప్యాడ్ నుంచి పవర్ ప్రాజెక్ట్ డ్యాం వరకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా 180 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తూ ఒక డీఎస్పీ స్థాయి అధికారితోపాటు ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులను నియమించినట్లు ఎస్పీ తెలిపారు. గ్రేహౌండ్స్, స్పెషల్ పార్టీ బలగాలతో నల్లమలను జల్లెడ పట్టినట్లు వివరించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ జి.వెంకటరాముడు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ జేవీ సంతోష్, ఆత్మకూరు డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జి.రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, ఏఎస్పీ జి.వెంకటరాముడు

ఆరుగురు డీఎస్పీల బదిలీ

కర్నూలు డీఎస్పీగా బాబు ప్రసాద్


రామాంజినాయక్ (ఆత్మకూరు) | షేక్ షర్ఫుద్దీన్ (ఏపీఎస్పీ, కర్నూలు) | శ్రీనివాసాచారి (మహిళా స్టేషన్) | శ్రీనివాసులు (డోన్) | రవికుమార్ (ఆళ్లగడ్డ)


జే.బాబు ప్రసాద్ (కర్నూలు)

కర్నూలు, జూలై 31: ఉమ్మడి కర్నూలు జిల్లాలో నలుగురు డీఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా 96 మంది డీఎస్పీ బదిలీలు జరిగాయి. ఈ నేపథ్యంలో కర్నూలు డీఎస్పీగా జే. బాబు ప్రసాద్‌ను నియమించింది. ఈయన ప్రస్తుతం కర్నూలు మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా ఉన్నారు. కర్నూలు డీఎస్పీగా ఉన్న విజయశేఖర్‌ను పోలీస్ హెడ్ క్వాటర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించింది. అలాగే డోన్ డీఎస్పీగా శ్రీనివాసులును నియమించింది. ఈయన ప్రస్తుతం సీఐడీ విభాగంలో ఉన్నారు. డోన్ డీఎస్పీగా ఉన్న శ్రీనివాసరెడ్డిని పోలీస్ హెడ్ క్వాటర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే ఏపీఎస్పీ సెకండ్ బెటాలియన్ డీఎస్పీగా ఉన్న భక్తవత్సలంను పొద్దుటూరు డీఎస్పీగా బదిలీ చేసింది. ఆళ్లగడ్డ డీఎస్పీగా షేక్ షర్ఫుద్దీన్‌ను ఏపీఎస్పీ సెకండ్ బెటాలియన్ డీఎస్పీగా నియమించింది. ఆత్మకూరు డీఎస్పీగా రామాంజినాయక్‌ను నియమించింది. ఈయన ప్రస్తుతం థర్డ్ బెటాలియన్‌లో డీఎస్పీగా ఉన్నారు. ఆత్మకూరు డీఎస్పీగా ఉన్న శ్రీనివాసరావును ప్రభుత్వం నెల్లూరు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా నియమించింది. అలాగే తిరుమల లా అండ్ ఆర్డర్ డీఎస్పీగా ఉన్న శ్రీనివాసాచారిని కర్నూలు మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీగా నియమించింది. నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డిని పోలీస్ హెడ్ క్వాటర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే కడప పోలీస్ ట్రైనింగ్ సెంటరులో డీఎస్పీగా ఉన్న రవికుమార్‌ను ఆళ్లగడ్డ డీఎస్పీగా నియమించింది.



కొనసాగుతున్న వరద ఉధృతి

శ్రీశైలం, జూలై 31: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల నుంచి వరద ప్రవాహం పెరగడంతో డ్యామ్ క్రస్టుగేట్లను బుధవారం 8 క్రస్టుగేట్లును 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువ నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. జూరాల నుంచి 3,01,850 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 23,502 క్యూసెక్కులు మొత్తం 3,25,352 వరద ప్రవాహం వస్తుంది. బుధవారం రాత్రి తొమ్మిది గంటల సమయానికి 3,62,411 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి చేరింది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 884.60 అడుగులుగా నమోదైంది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 213.4011 టీఎంసీలుగా నమోదైంది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 24,917 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 35,315 క్యూసెక్కుల, డ్యామ్ క్రస్టుగేట్ల ద్వారా 2,23,128 క్యూసెక్కులు మొత్తం 2,83,360 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

వైభవంగా లింగ మహా పూజ

పాల్గొన్న వివిధ మఠాల పీఠాధిపతులు


ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్నజగత్ గురువు

ఆదోని టౌన్, జూలై 31: స్థానిక రెడ్డీస్ కల్యాణ మంటపంలో బుధవారం జగత్ గురువు, కాశీ క్షేత్ర పీఠాధిపతి 1008 డాక్టర్ మల్లికార్జున విశ్వ రాజ్య మహాస్వాముల వారు ఇష్ట లింగ మహా పూజను వైభవంగా నిర్వహించారు. ఏడాదికి ఒక సారి జరిగే ఈ మహా లింగ పూజ కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. వీరశైవ మహిళా సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ మఠాల పీఠాధిపతులు జగత్ గురువుకు పూలతో పాద పూజ చేశారు. ఈ కార్యక్రమం వీరశైవ మహిళా సంఘం సభ్యురాలు జి.తేజస్విని, కౌన్సిలర్ కేయం నాగరత్న, పాటిల్ మహేశ్వరి ఆధ్వర్యంలో జరిగాయి.

కర్నూలు రేంజ్ పరిధిలో 35 మంది సీఐల బదిలీ

కర్నూలు, జూలై 31: కర్నూలు రేంజ్ పరిధిలో అనంతపురం, కడప, కర్నూలు తిరుపతి, నంద్యాల జిల్లాల్లో 35 మంది సీఐలు బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
కె.శ్రీరామ్	ఆర్ఎస్‌టీఎఫ్, తిరుపతి	ఆదోని వన్‌టౌన్ పీఎస్, కర్నూలు
ఎస్.తేజ మూర్తి	ఆదోని వన్‌టౌన్, కర్నూలు	చిన్న చౌక్ యుపీఎస్, కడప జిల్లా
వీ.నరసింహారెడ్డి	చిన్నచౌకు యుపీఎస్, కడప	వీఆర్ఎస్‌పీ, కడప
పీవీ సూర్య మోహన్ రావు	ఏపీ జెన్కో, (ఆన్ రిజిస్ట్రేషన్)	ఆదోని టూటౌన్, కర్నూలు
డి.గోపి	ఆదోని టూటౌన్, కర్నూలు జిల్లా	వీఆర్ఎస్‌పీ, కర్నూలు
బి.సుదర్శన్ రెడ్డి	వీఆర్ఎస్‌పీ, నంద్యాల	ఎమ్మిగనూరు టౌన్, కర్నూలు జిల్లా
బి.మధుసూదన్‌రావు	ఎమ్మిగనూరు టౌన్, కర్నూలు జిల్లా	వీఆర్ఎస్‌పీ, కర్నూలు
ఏ.గంగాధర్	వీఆర్, కర్నూలు	గోనెగండ్ల, కర్నూలు జిల్లా
ఏ.రామకృష్ణయ్య	గోనెగండ్ల, కర్నూలు జిల్లా	వీఆర్ఎస్‌పీ, కర్నూలు
కె.శ్రీనివాస్ నాయక్	సీసీఎస్, కడప	ఆలూరు పీఎస్, కర్నూలు జిల్లా
బి.వెంకటేశ్వర్లు	ఆలూరు పీఎస్, కర్నూలు జిల్లా	వీఆర్ఎస్‌పీ, కర్నూలు
డి.మస్తాన్ వలి	భాకరాపేట్ సర్కిల్, తిరుపతి జిల్లా	ఆస్పరి పీఎస్, కర్నూలు జిల్లా
ఎస్.హనుమంతప్ప	ఆస్పరి పీఎస్, కర్నూలు	వీఆర్ఎస్‌పీ, కర్నూలు
బీఏ మంజునాథ్	ఆదోని ట్రాఫిక్, కర్నూలు	కోసిగి సర్కిల్, కర్నూలు జిల్లా
జి.ప్రసాద్	కోసిగి సర్కిల్, కర్నూలు జిల్లా	వీఆర్ఎస్‌పీ, కర్నూలు
పి.రామాంజులు	ఖాజీపేట పీఎస్, కడప	మంత్రాలయం సర్కిల్, కర్నూలు జిల్లా
కె.ఎరిషావలి	మంత్రాలయం సర్కిల్, కర్నూలు జిల్లా	వీఆర్ఎస్‌పీ, కర్నూలు
జీవీ నాగరాజరావు	సీసీఎస్, కర్నూలు	కర్నూలు టూటౌన్
జి.ఇంతియాజ్ బాషా	కర్నూలు టూటౌన్	వీఆర్ఎస్‌పీ, కర్నూలు
సీఎం రాకేష్	సోషల్ మీడియా, సైబర్ క్రైమ్, నంద్యాల	డోన్ రూరల్, నంద్యాల జిల్లా
కె.ప్రవీణ్ కుమార్	డోన్ టౌన్, నంద్యాల జిల్లా	వీఆర్ఎస్‌పీ, నంద్యాల జిల్లా
ఎం.వెంకటరామిరెడ్డి	గుత్తి పీఎస్, అనంతపురం జిల్లా	ప్యాపిలి సర్కిల్, నంద్యాల జిల్లా
జి.సుధాకర్ రెడ్డి	ప్యాపిలి సర్కిల్, నంద్యాల జిల్లా	నందికొట్కూరు రూరల్ సర్కిల్, నంద్యాల
వై.ప్రవీణ్ కుమార్ రెడ్డి	పత్తికొండ యుపీఎస్, కర్నూలు జిల్లా	నందికొట్కూరు యుపీఎస్, నంద్యాల
జి.ప్రకాష్ కుమార్	నందికొట్కూరు యుపీఎస్, నంద్యాల	వీఆర్‌పీఎస్, నంద్యాల
డి.వెంకటేశ్వరరావు	ఎస్‌బీ-2, నంద్యాల	బేతంచెర్ల యుపీఎస్, నంద్యాల
జి.ప్రియతమ్ రెడ్డి	బేతంచెర్ల యుపీఎస్‌నంద్యాల	వీఆర్ఎస్‌పీ, నంద్యాల
ఎం.మంజునాథరెడ్డి	సీసీఎస్, నంద్యాల	ఆత్మకూరు సర్కిల్, నంద్యాల జిల్లా
ఎం.నాగభూషణం	ఆత్మకూరు సర్కిల్, నంద్యాల	వీఆర్ఎస్‌పీ, నంద్యాల
జే.శివశంకర్	వీఆర్, కడప	మైదుకూరు, కడప
ఎం.శ్రీనాథరెడ్డి	మైదుకూరు రూరల్ సర్కిల్, కడప	వీఆర్ఎస్‌పీ కడప
పి.నరేష్ బాబు	వీఆర్, అన్నమయ్య	ఎర్రగుంట్ల యుపీఎస్, కడప
ఆర్.ఈశ్వరయ్య	ఎర్రగుంట్ల యుపీఎస్, కడప	వీఆర్ఎస్‌పీ, కడప
బి.రామకృష్ణ	ఆన్ రిజిస్ట్రేషన్, ఎస్‌హెచ్ఆర్‌సీ, కర్నూలు	కడప వన్‌టౌన్, కడప
సి.భాస్కర్ రెడ్డి	కడప వన్‌టౌన్, వైఎస్సార్, కడప	వీఆర్ఎస్‌పీ, కడప

తహసీల్దార్లకు స్థానాల కేటాయింపు

కర్నూలు(కలెక్టరేట్), జూలై 31: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా కర్నూలు జిల్లాకు చెందిన తహసీల్దార్లు జోన్-4లో వివిధ జిల్లాలకు బదిలీ అయ్యారు. ఎన్నికల విధులనంతరం తహసీల్దార్లను సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జిల్లాకు చెందిన తహసీల్దార్లు డీఆర్వో కార్యాలయంలో రిపోర్టు చేసుకున్నారు. వీరికి బుధవారం జిల్లాలోని వివిధ మండలాలకు పోస్టింగులు కేటాయిస్తూ కలెక్టర్ పి.రంజిత్ బాషా ఉత్తర్వులు జారీ చేశారు.

తహసీల్దార్	కేటాయించిన స్థానం
పి. రాజేశ్వరి	కలెక్టరేట్ ఏఓ
ఐ. వేణుగోపాల్	కర్నూలు ఆర్డీఓ ఏఓ
కె. వసుంధర	ఆదోని ఆర్డీఓ ఏఓ
కె. సతీష్	పత్తికొండ ఆర్డీఓ ఏఓ
ఏ. వెంకటేశ్వర్లు	కలెక్టరేట్ ఏఓ (ఎల్ఆర్)
ఏ. వేణుగోపాల్	కలెక్టరేట్ (కేఆర్‌సీసీ)
వేణుగోపాల్	ఆర్డీఓ (కేఆర్‌సీసీ),
ఎస్. యోగేశ్వరి దేవి	కలెక్టరేట్ (న్యాయ)
ఏ. వెంకటేశ్వర్లు	కలెక్టరేట్ (కోఆర్డినేషన్)
ఏ. వేణుగోపాల్	కలెక్టరేట్ (ల్యాండ్)
టీవీ రమేష్‌బాబు	కర్నూలు రూరల్
కే. ఆంజనేయులు	కల్లూరు
డి. వెంకటేష్ నాయక్	కోడుమూరు
ఐ. విజయశ్రీ	సి. బెళగల్
కె. రామాంజనేయులు	గూడూరు
ఎస్. రామాంజనమ్మ	కర్నూలు అర్బన్
ఎస్. వెంకటరమణ	ఓర్వకల్లు
సి. చంద్రశేఖర్ వర్మ	వెల్దుర్తి
ఆర్. శివరాముడు	ఆదోని
ఎస్. శ్రీనాథ్	పెద్దకడుమూరు
కె. మల్లికార్జున స్వామి	కౌతాళం
ఎస్. రవి	మంత్రాలయం
ఏ. నిత్యానంద రాజులు	కోసిగి
ఏ. శేషఫణి	ఎమ్మిగనూరు
కె. శ్రీనివాసులు	నందవరం
కె .కుమారస్వామి	గోనెగండ్ల
బి. జయన్న	దేవనకొండ
ఎస్. నజ్మబాను	హాలహర్వి
ఆర్.గోవింద్ సింగ్	ఆలూరు
జే. శివశంకర్ నాయక్	ఆస్పరి
డి. చంద్రశేఖర్	క్రిష్ణగిరి
డి. హుసేన్ సాహెబ్	మద్దికెర
ఈ. వెంకటలక్ష్మి	పత్తికొండ
బి. నాగరాజ్	తుగ్గలి
ఎజాజ్ అహ్మద్	చిప్పగిరి

విద్యుదాఘాతంతో అసిస్టెంట్ లైన్‌మెన్ మృతి

ఉయ్యాలవాడ, జూలై 31: మండలంలోని అల్లూరు గ్రామంలో విద్యుదాఘాతంతో అసిస్టెంట్ లైన్‌మెన్ ఇల్లూరి సుంకయ్య (46) మృతి చెందాడు. గ్రామానికి చెందిన ఓ రైతు ట్రాన్స్‌ఫార్మరు వద్ద ఫ్యూజులు వేస్తుండగా ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో సుంకన్న అక్కడికక్కడే కుప్పకూలాడు. స్థానిక రైతులు హుటాహుటిన కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు సంతానం. పెద్దకుమార్తెకు వివాహం కాగా, చిన్నకుమార్తె హైదరాబాదులో చదువుకుంటోంది. భార్య పుల్లమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్‌గా డాక్టర్ ఎం జాన్సన్



నంద్యాల టౌన్, జూలై 31: నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్‌గా డాక్టర్ ఎం.జాన్సన్ బాధ్యతలు చేపట్టారు. బుధవారం ఏడీఆర్‌గా పని చేస్తున్న డాక్టర్ సరళమ్మ పదవీ విరమణ చేయడంతో ఆ స్థానానికి అనంతపురం జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్‌గా పని చేస్తున్న జాన్సన్‌ను ఏడీఆర్‌గా నియమించారు. డాక్టర్ సరళమ్మ నుంచి ఏడీఆర్‌గా జాన్సన్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల ఆర్ఏఆర్ఎస్‌కు దేశ వ్యాప్త గుర్తింపు ఉందన్నారు. భవిష్యత్తులో ఇక్కడి నుంచి పరిశోధనలు మరింత విస్తృతం చేయడమే కాకుండా వివిధ పంటల్లో కొత్త వంగడాల సృష్టికి ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ అమలు చేస్తామని పేర్కొన్నారు.

కడప రీజనల్ డైరెక్టర్‌గా శ్రీనివాసులు



కర్నూలు(హాస్పిటల్), జూలై 31: వైద్య ఆరోగ్యశాఖ కడప (జోన్-4) రీజనల్ డైరెక్టర్‌గా జిల్లాకు చెందిన సివిల్ సర్జన్ డా.వై. శ్రీనివాసులు నియమితులయ్యారు. కడప ఆర్డీగా పని చేస్తున్న డా.జి. రత్నకుమారి బుధవారం పదవి విరమణ పొందడంతో ఆమె స్థానంలో కడప రిమ్స్ హాస్పిటల్‌లో సీఎస్ఆర్ఎంవోగా పని చేస్తున్న డా.వై. శ్రీనివాసులును నియమించారు. ఈ మేరకు గురువారం ఆయన కడప ఆర్డీ (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు చేపట్టనున్నారు. నందవరంలో పుట్టిన డా. శ్రీనివాసులు 1 నుంచి 10 వరకు బీ. క్యాంపు ప్రభుత్వ హై స్కూల్‌లో, ఇంటర్ టౌన్ మోడల్ కాలేజీలో, 1985 బ్యాచ్ కింద ఎంబీబీఎస్ కర్నూలు కేఎంసీలో చదువుకున్నారు. దేవనకొండ పీహెచ్‌సీలో 1994లో మెడికల్ ఆఫీసర్‌గా ఉద్యోగ ప్రస్థానం మొదలైంది. 2000 నుంచి 2010 వరకు కర్నూలు జీజీహెచ్‌లో సీఎంవో, బర్న్ వార్డులో 2012లో పాణ్యం సీహెచ్‌సీలో కర్నూలు జీజీహెచ్ డిప్యూటీ సీఎస్ఆర్ ఎంవోగా 2016 నుంచి 2019 వరకు పని చేశారు. అనంతరం పదోన్నతి కింద 2019లో ఒంగోలు అడిషనల్ డీఎంహెచ్‌వోగా, 2022లో బాపట్ల డీఎంహెచ్‌వోగా పని చేశారు. ప్రస్తుతం కడప రిమ్స్ హాస్పిటల్ సీఎస్ఆర్ఎంవోగా పని చేస్తున్నారు.

పరిపాలనాదక్షుడు డాక్టర్ ప్రవీణ్ కుమార్


డీఎంహెచ్‌వోను సన్మానిస్తున్న ఉద్యోగులు

కర్నూలు(హాస్పిటల్), జూలై 31: కర్నూలు డీఎంహెచ్‌వోగా పని చేసిన డాక్టర్ ప్రవీణ్ కుమార్ పరిపాలనదక్షుడని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్ అన్నారు. ఈ మేరకు డీఎంహెచ్‌వగా పదవి విరమణ చేస్తున్న ప్రవీణ్ కుమార్‌ను బుధవారం సాయంత్రం కర్నూలు ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో వైద్యులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. పృథ్వి వెంకటేశ్వర్లు, ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. సత్యవతి, ఎఫ్‌డీపీ నోడల్ ఆఫీసర్ బాలకృష్ణ, డీపీవో ఉమాదేవి, ఏవో కె.అరుణ, డీఎంహెచ్‌వో ఆఫీస్ సూపరింటెండెంట్ పత్తికొండ శ్రీనివాసులు పాల్గొన్నారు.

డెంగీతో వ్యక్తి మృతి

ఆదోని, జూలై 31: ఆదోని పట్టణంలోని శుక్రవారపుపేట కాలనీకి చెందిన నాగరాజు (40) డెంగి లక్షణాలతో బుధవారం మృతి చెందాడు. నాగరాజు 11 రోజులు క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. ప్రమాదంలో గాయాలైన కాళ్లకు చికిత్సలు చేస్తుండగా డెంగి లక్షణాలను వైద్యులు గుర్తించి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తీసుకువెళ్లాలని సూచించారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నాగరాజు బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య వీరేశమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

న్యాయవాద వృత్తి కీలకం

● జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్. శ్రీనివాసరావు


జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాసరావును సన్మానిస్తున్న వినియోగదారుల కమిషన్ చైర్మన్

కర్నూలు(లీగల్), జూలై 31: సమాజంలో న్యాయవాద వృత్తి కీలకమైనదని, న్యాయవాదులు తమ వృత్తి నైపుణ్యాలను పెంచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్. శ్రీనివాసరావు సూచించారు. ఆయన పదవి విరమణ చేస్తున్న సందర్భంగా స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఒక ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కర్నూలులో ప్రధాన న్యాయాధికారిగా 22 నెలల పాటు పని చేశానని, ఈ కాలంలో సహకరించిన న్యాయవాదులకు, న్యాయమూర్తులకు, న్యాయ శాఖ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవలె వచ్చిన మూడు క్రిమినల్ చట్టాల గురించి న్యాయవాదులు క్షుణ్ణంగా అవగాహన పెంచుకుంటే కక్షిదారులకు న్యాయాన్ని అందిస్తారని అన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పాలూరి రవిగువేరా, సీనియర్ న్యాయవాదులు వై. జయరాజు, జోగయ్యశర్మ, ఎంఎల్ శ్రీనివాసరెడ్డి, మురళి మోహన్ పాల్గొన్నారు.

● జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎన్. శ్రీనివాసరావు పదవి విరమణ సందర్భంగా జిల్లా వినియోగదారుల కమిషన్ చైర్మన్ కరణం కిషోర్ కుమార్, సభ్యులు ఎస్.నారాయణ రెడ్డి, నజీమా కౌసర్ ఆయనను ఘనంగా సన్మానించారు.

నేడు స్టాండింగ్ కమిటీ ఎన్నికలు

● బరిలో 10 మంది కార్పొరేటర్లు ● పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాల నుంచి ఇద్దరు సభ్యులు


ఎన్నికల అవగాహనపై కార్పొరేటర్లకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్న కమిషనర్

కర్నూలు(న్యూసిటీ), జూలై 31: నగర పాలక సంస్థ పరిధిలోని స్టాండింగ్ కమిటీ ఎన్నికలు గురువారం నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం నూతన కౌన్సిల్ హాలులో ఎన్నికల అవగాహనపై కార్పొరేటర్లకు కమిషనర్ పివి. రామలింగేశ్వర్ వర్క్‌షాపు నిర్వహించారు. వర్క్‌షాపుకు మేయర్, డిప్యూటీ మేయర్లతో పాటు కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఇప్పటికే ఎన్నికల బరిలో 10 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ప్రస్తుతం పాణ్యం, కోడుమూరు నియోజకవర్గం నుండి ఇద్దరు సభ్యులను ఖరారు చేసుకున్నారు. పాణ్యం నియోజకవర్గం నుంచి 31వ వార్డు మిద్దె చిట్టెమ్మ నామినేషన్ దాఖలు చేసారు. అయితే పాణ్యం నుంచి ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో కోడుమూరు నియోజకవర్గం నుంచి 40 వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డిని బలపరిచేలా నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాణ్యం నియోజకవర్గం నుంచి ఇద్దరు సభ్యులు ఖరారైనట్లు తెలుస్తోంది. అయితే స్టాండింగ్ చైర్మన్‌గా మేయర్ వ్యవహరిస్తారు. ఇందులో ఐదుగురు కమిటీ సభ్యులు ఉంటారు. ప్రస్తుతం కర్నూలు నియోజకవర్గం వైసీపీ-3, కర్నూలు నియోజకవర్గం టీడీపీ-4, పాణ్యం నియోజకవర్గం వైసీపీ-1, కోడుమూరు నియోజకవర్గం వైసీపీ-1 కర్నూలు నియోజకవర్గం ఇండిపెండెంట్-1 బరిలో ఉన్నారు.

కర్నూలు నియోజకవర్గంలో ఉత్కంఠ...

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక వైసీపీ నుంచి టీడీపీలోకి సుమారు 9 మంది కార్పొరేటర్లు మారారు. దీంతో ఈసారి ఎలాగైనా టీడీపీ నుంచి కమిటీలో స్థానం సంపాదించాలని నలుగురు కార్పొరేటర్లు నామినేషన్ దాఖలు చేశారు. అదే విధంగా వైసీపీ నుంచి ఐదుగురు నామినేషన్ వేశారు. అయితే కర్నూలు నియోజకవర్గం టీడీపీ నుంచి ఎవరిని కమిటీ సభ్యులుగా ఎన్నుకోవాలో పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాటు వైసీపీ జిల్లా నాయకులు ఇటీవల జరిగిన కార్పొరేటర్ల అంతర్గత సమావేశంలో బరిలో ఉన్న ఐదుగురిని ఎన్నుకోవాలని...టీడీపీ కార్పొరేటర్లకు ఓటు వేస్తే సస్పెన్షన్ తప్పదని హెచ్చరించారు. అయితే ప్రస్తుతం ఈ ఎన్నికలు సీక్రెట్ పద్ధతిలో జరుగుతుండటంతో ఎంత మంది వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ కార్పొరేటర్లకు ఓటు వేసేదీ అర్థం కావడం లేదు. అంతే కాకుండా ఇటీవల జరిగిన మూడు స్టాండింగ్ కమిటీ సభ్యులకు నిరాశే మిగిలింది. ఎన్నికైన 8 నెలలకే సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ రావడం...కేవలం మూడు మాత్రమే స్టాండింగ్ కమిటీ సమావేశాలే జరగడంతో నిరాశ చెందారు. అయితే నాల్గవ స్టాండింగ్ కమిటీ సభ్యులకు మాత్రమే సంవత్సరంపాటు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అయితే ఐదో స్టాండింగ్ కమిటీ సభ్యులకు కూడా 2026లో వచ్చే కార్పొరేషన్ ఎన్నికలతో కేవలం 8 నెలలు మాత్రమే ఉంటుంది.

స్థాయి సంఘ ఎన్నికలకు సిద్ధం

కమిషనర్ పివి. రామలింగేశ్వర్

కర్నూలు(న్యూసిటీ), జూలై 31: నగర పాలక సంస్థ స్థాయి సంఘం ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు కమిషనర్ పివి. రామలింగేశ్వర్ తెలిపారు. బుధవారం నూతన కౌన్సిల్ హాలులో నిర్వహించిన సమావేశానికి మేయర్, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు హాజరయ్యారు. ముందుగా పోలింగ్ జరిగే విధానాన్ని, ఫలితాల లెక్కింపు ప్రక్రియను వివరించారు. అనంతరం పలువురు కార్పొరేటర్లు లేవనత్తిన సందేహాలను కమిషనర్ నివృత్తి చేశారు. ఓటు వేయడానికి కార్పొరేటర్లు పార్టీ కండువాలు, మొబైల్ ఫోన్లతో రాకూడదని, బ్యాలెట్ నమూనాలో పది మంది అభ్యర్థులలో గరిష్టంగా ఐదుగురికి ఓటు వేసే అవకాశం ఉందన్నారు. ఆపై ఎక్కువ ఓట్లు వేసినా, అభ్యర్థికి ఎదురుగా కాకుండా అటు ఇటుగా వేసిన మొత్తం బ్యాలెట్ ఓట్లు చెలనివిగా పరిగణిస్తారని ఆయన తెలిపారు. అంతే కాకుండా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. మూడేళ్ల తరువాత మొట్టమొదటిసారిగా జరుగుతున్న ఎన్నికలకు పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, ఆ తర్వాత వెంటనే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుందన్నారు.

అశ్విని హాస్పిటల్ ప్రారంభం


అశ్విని హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న టీజీ వెంకటేశ్, గౌరు చరిత

కర్నూలు(హాస్పిటల్), జూలై 31: నగరంలోని జోహరాపురం రోడ్డులో సీనియర్ ఊపిరి తిత్తుల వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కార్పొరేట్ హంగులతో నిర్మించిన అశ్విని హాస్పిటల్స్‌ను బుధవారం రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేశ్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ హైదరాబాదు, బెంగుళూరు వంటి మహానగరాల తరహాలో కర్నూలులో అశ్విని హాస్పిటల్స్‌ను నిర్మించడం అభినందనీయమన్నారు. గతంలో మెరుగైన సేవల కోసం ఇతర మెట్రో నగరాలకు వెళ్లాల్సిన అవసరం ఉండేదని, ఇప్పుడు కర్నూలు మెడికల్ హబ్‌గా మారిందన్నారు. సీనియర్ పల్మనాలజిస్టుగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి మొదటి నుంచి సేవాభావం కలిగిన డాక్టర్ అని అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఆధునిక వసతులతో హాస్పిటల్‌ను నిర్మించడం అభినందనీయమన్నారు. డాక్టర్ శ్రీనివాసరెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులందరూ వివిధ విభాగాల్లో నిష్ణాతులైన డాక్టర్లు 24 గంటలు ఉత్తమ సేవలు అందించాలని కోరారు. ఆసుపత్రికి వచ్చే రోగులు త్వరగా కోలుకుని వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత గౌరు వెంకటరెడ్డి, పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ నాయకులు నందిరెడ్డి సాయిరెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

నీటి విడుదల

వెలుగోడు, జూలై 31: తెలుగుగంగ జలాశయ వన్‌ఆర్ తూము ద్వారా బుధవారం తెలుగుగంగ అధికారులు టీడీపీ నాయకులు కలిసి నీటిని విడుదల చేశారు. ముందుగా తూము వద్ద అధికారులు నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 30 క్యూసెక్కుల నీటిని తూము ద్వారా విడుదల చేశారు. రైతులు ఎమ్మెల్యే బుడ్డారాజశేఖరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కామేశ్వరీదేవికి ఆషాఢం సారె


మహానందిలో అమ్మవారికి సారె తీసుకొస్తున్న ఈవో, భక్తులు

మహానంది, జూలై 31: ఆషాఢ మాసం బహుళ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని మహానందిలోని కామేశ్వరీదేవికి బాలాజి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో చీర, సారె అందజేశారు. బుధవారం ఆలయం సమీపంలోని గరుడనంది ఆలయం వద్ద వీరికి ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి దంపతులతో పాటు ఏఈవో మధు ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన 700 మంది సేవా సమితి సభ్యులకు స్వాగతం పలికారు. ఈవో సమక్షంలో అమ్మవారికి చీర, సారె అర్చకులకు అందజేశారు.

నంద్యాల (కల్చరల్): నంద్యాల జగజ్జననీ అమ్మవారికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పుట్టింటి చీర, సారె సమర్పించారు. దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


నంద్యాలలో కోలాటమాడుతున్న మహిళలు





నీట మునిగిన పంటలు

- చెరువు ఆక్రమణలే కారణమని రైతులు ఆరోపణ

పాణ్యం, జూలై 31: చెరువును ఆక్రమించిన ఫలితం రైతులకు శాపంగా మారింది. చెరువులో రహదారులు, పంట పొలాలు, కల్లాలు, ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో ఈ పరిస్థితి దాపురించిందని బుధవారం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం రైతులకు చేసిన నష్టానికి ఇదే నిదర్శనం. చెరువును ఆక్రమిస్తే వచ్చే నష్టాలను ఏడాది క్రితమే ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. మైనర్ ఇరిగేషన్ అధికారుల నిర్లక్షంతో దాదాపు వంద ఎకరాల వరి నాట్లు నీట మునిగి నష్టాన్ని మిగిల్చాయి. కొండజూటూరు చెరువు ఆక్రమణలతో చెరువు కుంచించుకుపోయి చెరువులోని నీరు పంటపొలాలను ముంచెత్తుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం ఎస్సార్బీసీకి నీరు వదలడంతో చెరువుకు పెద్ద ఎత్తున నీరు చేరింది. చెరువు ఆక్రమణలతో నీరు చెరువులోకి చేరక పంట పొలాలను ముంచెత్తింది. గతేడాది చెరువులో అక్రమంగా వేసిన రోడ్డు, ఇళ్ల నిర్మాణాలపై ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు చేపట్టకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం. ఆక్రమణలు తొలగిస్తే తప్ప రైతాంగానికి న్యాయం జరగదని పేర్కొంటున్నారు. పంటభూములు మునుగుతాయన్న కారణాలను చూపి కొందరు వ్యక్తులు అధికారుల అనుమతి లేకుండా అలుగును తొలగించారు. తమకు అనుకూలంగా చెరువును ఆక్రమించారని ఆరోపిస్తున్నారు.


కొండజూటూరులో నీట మునిగిన వరి పంట


చెరువులో అక్రమంగా వేసిన రహదారి

ఎకరాకు రూ.15 వేలు నష్టం

పంట కాలువలకు నీరు వదిలినా రైతులకు ఆ నీరు శాపంగా మారిందని కొండ జూటూరు రైతులు సంటెన్న, రమేష్, మల్లయ్య, చిన్న ఈశ్వరయ్య, రామసుబ్బయ్య ఆరోపించారు. చెరువు ఆక్రమణలతో పంటపొలాలు పూర్తిగా మునకకు గుర య్యాయన్నారు. ఎకరాకు రూ.15 వేలు పెట్టి నాటు వేసిన వరి నాట్లు నీట మునిగాయని ఆరోపించారు. విచ్చలవిడిగా చెరువును ఆక్రమించడమే దీనికి కారణమన్నారు.

ఆక్రమణల తొలగింపునకు సహకరించాలి

చెరువులో రోడ్డు వేయడంపై అప్పట్లోనే పాణ్యం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. దీనిపై ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదు. ఆక్రమణలపై ఎస్ఈ, సీఈ దృష్టికి తీసుకెళ్లాం. ఆక్రమణల సమయంలో గ్రామస్థులు ఎవరూ ముందుకు రాలేదు. ఆక్రమణలు తొలగించడానికి గ్రామస్థులు సహకరించాలి. పంటల ముంపుపై పరిశీలించి చర్యలు చేపడతాం.

- అర్జున్‌సింగ్, ఏఈఈ, చిన్న నీటిపారుదల శాఖ, పాణ్యం

నాలుగో తూమును తెరవవద్దు


మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

నంద్యాల రూరల్, జూలై 31: నంద్యాల మండల కానాల నాగమ్మ చెరువు అనధికార నాలుగో తూమును తెరవనీయవద్దని కానాల గ్రామ రైతులు న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కోరారు. బుధవారం నంద్యాలలో మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. నాలుగో తూము తెరవడం వల్ల కానాలలో చివరి ఆయుకట్టుకు సాగునీరు అందదని మంత్రి ఎదుట ఏకరువ పెట్టారు. గోస్పాడు మండలం ఎం. చింతకుంట్ల గ్రామ, కానాల గ్రామ భూస్వాములు కొందరు అప్పట్లో ఎలాంటి అనుమతులు లేకుండా అనధికార తూమును నాగమ్మ చెరువుకు ఏర్పాటు చేశారని, అయితే అప్పటికే నాగమ్మ చెరువుకు మూడు తూములు ఉన్నట్లు మంత్రికి దృష్టికి తెచ్చారు. కోర్టు ఆదేశాలతో గతంలో తూమును మూసివేశారని, అయితే మళ్లీ తెరవాలని కొందరు ప్రయత్నిస్తున్నారని అన్నారు.

అక్రమ నిర్మాణాలపై సభ్యుల ధ్వజం


అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం

నంద్యాల టౌన్, జూలై 31: నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు యథేశ్చగా సాగుతున్నాయని కౌన్సిల్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. బుధవారం చైర్‌పర్సన్ మాబున్నీసా అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. టీడీపీ కౌన్సిలర్ మాబువలి, వైసీపీ కౌన్సిలర్ కృష్ణమోహన్ టౌన్‌ప్లానింగ్ అధికారులపై విరుచుకుపడ్డారు. అధికారుల నిర్లక్ష్యంతో మున్సిపల్ ఆస్తులు కబ్జాకు గురవుతున్నాయని విమర్శించారు. టౌన్‌ప్లానింగ్ అధికారుల అనుమతులు లేకుండా సాగుతున్న అక్రమ నిర్మాణాల్లో అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. టౌన్ ప్లానింగ్ అధికారులు మాట్లాడుతూ అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇచ్చామని, అయినా నిర్మాణాలు కొనసాగిస్తున్నారని చెప్పడంపై అధికార, ప్రతిపక్ష సభ్యులు అధికారుల తీరును ఎండగట్టారు. 35వ వార్డు వైసీపీ కౌన్సిలర్ బాసిత్ మాట్లాడుతూ తన వార్డులో టీడీపీ నాయకుడు ఎన్ఎండీ ఫిరోజ్ వచ్చి ఫొటోలు దిగిపోయారని, కేవలం పబ్లిసిటీ కోసమే అలా చేశారని విమర్శించడంతో టీడీపీ కౌన్సిలర్ ఖండే శ్యామ్‌సుందర్ లాల్‌తో పాటు అధికార వైసీపీకే చెందిన కౌన్సిలర్ తబ్రేజ్ బాసిత్‌పై ఎదురు దాడికి దిగారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి కేవలం రెండు నెలలు కావస్తున్నదని, వార్డుల్లో ఉన్న సమస్యలను తెలుసు కునేందుకే మంత్రి కుమారుడు ఫిరోజ్ వార్డు పర్యటన చేస్తున్నారని శ్యామ్ సుందర్ అన్నారు. వ్యక్తుల గురించి వద్దని, సమస్యలపైనే మాట్లాడాలని వైసీపీ కౌన్సిలర్ బాసిత్‌కు అదే పార్టీకి చెందిన కౌన్సిలర్ తబ్రేజ్ సూచించారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఉన్న పలు రకాల సమస్యలను ఆయా వార్డుల కౌన్సిలర్లు చర్చలో లేవనెత్తారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

'వేతనాలు అందడం లేదు'


గౌరు వెంకటరెడ్డికి సమస్యలు వివరిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది, ప్రజలు

పాణ్యం, జూలై 31: మూడు నెలల నుంచి వేతనాలు అందడం లేదని, ఇప్పించాలని గ్రీన్‌కో ఎనర్జీస్ ప్రైవేట్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది కోరారు. బుధవారం కర్నూలులో టీడీపీ నాయకుడు గౌరు వెంకటరెడ్డిని కలిసి తమ గోడును విన్నవించుకున్నారు. కందికాయపల్లి గ్రీన్‌కోలో సోలార్ కంపెనీలో 140మంది సెక్యూరిటీ సిబ్బంది ఫోర్టిన్ సెక్యూరిటీ సర్వీస్ సంస్థ ద్వారా నియమితులయ్యారని తెలిపారు. గత రెండేళ్లుగా విధులు నిర్వహిస్తుండగా, మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడంలేదని తెలిపారు. అలాగే ఇప్పటి వరకు పీఎఫ్ నెంబరు గానీ, పీఎఫ్ గానీ ఇవ్వలేదన్నారు. కంపెనీ ఇన్‌చార్జిని అడిగితే విధుల నుంచి తొలగిపోవాలని నిర్లక్ష సమాధానం ఇస్తున్నారని ఆరోపించారు. గుజరాత్‌లోని సోజల్ కంపెనీ ఈ సెక్యూరిటీ సర్వీస్ నిర్వహిస్తోందన్నారు. వెంటనే సెక్యూరిటీ వేతనాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై ఆయన మాట్లాడుతూ సెక్యూరిటీల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కందికాయపల్లె గ్రామ ప్రజలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మల్లన్న సన్నిధిలో ప్రముఖులు


ఆలయ ప్రాంగణంలో దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ


ఆలయ ప్రాంగణంలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

శ్రీశైలం, జూలై 31: శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లను బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, దేవదాయశాఖ కమిషనర్ ఎస్. సత్యనారాయణ, కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం ఆలయ రాజగోపురం వద్దకు వచ్చిన వీరికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వీరు స్వామికి అభిషేకం నిర్వహించుకుని తరువాత భ్రమరాంబికా అమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండంలో వీరికి వేద పండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

విద్యాభివృద్ధికి ఎంఈవో కృషి: డీఈవో


డీఈవోను సన్మానిస్తున్న పదవీ విరమణ పొందిన ఎంఈవో

కొత్తపల్లి, జూలై 31: గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ఎంఈవో శ్రీరాములు కృషి చేశారని నంద్యాల డీఈవో సుధాకర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని వెన్నెల గార్డెన్‌లో ఎంఈవో-2 ఇనయతుల్లా అధ్యక్షతన ఎంఈవో-1 శ్రీరాములు పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఈవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపీడీవో జవహర్‌బాబుతో పాటు ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు శ్రీరాములు సేవలను కొనియాడారు. అలాగే శ్రీరాములు దంపతులను డీఈవోతో పాటు పలువురు సత్కరించారు. అలాగే డీఈవోను కూడా పలువురు సన్మానించారు. జడ్పీటీసీ సోముల సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ కుసుమలత, ఇన్‌చార్జి ఎంఈవో బ్రహ్మం నాయక్, ఆత్మకూరు ఎంఈవో బాలాజి నాయక్, విశ్రాంత ఎంఈవో జానకీరామ్, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, ఉపాధ్యాయులు ఆంజనేయులు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

'లక్ష్యాన్ని సాధించాలి'

నంద్యాల రూరల్, జూలై 31: ప్రభుత్వం పొదుపు సంఘాలకు పొదుపునుంచి డ్రా చేసుకోవడానికి జిల్లా వ్యాప్తంగా ఈసంవత్సరం రూ.257 కోట్లు లక్ష్యంగా నిర్ణయించిందని, సంబంధిత అధికారులు లక్ష్యాన్ని సాధించాలని లీడ్‌బ్యాంక్ జిల్లామేనేజర్ రవీంద్రకుమార్ తెలిపారు. బుధవారం నంద్యాల డీఆర్‌డీఏ కార్యాలయంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బ్యాంకర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రవీంద్రకుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు రూ.35 కోట్లు మాత్రమే చేరాయన్నారు. ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు సంబంధించి 6456 మందికి రూ 90.38 కోట్లు రుణాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 102 సభ్యులకు మాత్రమే రూ 1.64 కోట్లు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. బ్యాంక్ మేనేజర్లు అందరూ సెప్టెంబర్ 30 నాటికి ప్రతి మండలంలో 120 మందికి రుణాలు ఇవ్వాలన్నారు. కౌలు రైతులందరికి రుణాలు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ కోరారు. జిల్లా ఉద్యాన శాఖాదికారి నాగరాజు మాట్లాడుతూ పీఎంయఫ్ఎంఇ కింద గుర్తించిన లబ్ధిదారులకు సంబంధించిన వివరాలను బ్యాంకులకు పంపడం జరిగిందన్నారు. పీఎంఈజీపీ కింద బ్యాంకులకు సంబందించిన దరఖాస్తులను త్వరగా మంజూరు చేయాలని పరిశ్రమల శాఖ డీఎం శ్రీనివాసులు కోరారు. సమావేశంలో జిల్లాలోని బ్యాంక్ కంట్రోలర్స్, బ్యాంక్ లింకేజీ ఏపీఎం ఎల్లయ్య, జిల్లా జీవనోపాధుల ఎపీఎం బాబురావు తదితరులు పాల్గొన్నారు.

'పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలి'

నంద్యాల టౌన్, జూలై 31: ప్రస్తుత ఖరీఫ్‌లో వాతావరణ పరిస్థితులను అనుగుణంగా శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలకు అనుగుణంగా రైతులు పంటలు సాగు చేయాలని నంద్యాల ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ సరళమ్మ సూచించారు. బుధవారం ఆర్ఏఆర్ఎస్‌లో శిక్షణ, సందర్శన సమావేశాన్ని జిల్లా వ్యవసాయ శాఖ, ఆర్ఏఆర్ఎస్ సంయుక్త నిర్వహణలో నిర్వహించారు.

- నంద్యాల ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్‌గా సరళమ్మ బుధవారం పదవీ విరమణ చేశారు.

రోడ్డుపై కేసీ నీరు


ప్రధాన రహదారిపై పారుతున్న కేసీ కాలువ నీరు

జూపాడుబంగ్లా, జూలై 31: మండలంలోని తూడిచర్ల గ్రామంలో బుధవారం కేసీ పంట కాలువల నుంచి గ్రామ ప్రధాన రహదారి పైక్కెక్కి ప్రవహించాయి. దీంతో గ్రామప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పంటకాల్వలు గ్రామంలో ఉండటంతో పాటు, మట్టితో పూడిపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జలాశయం మట్టి కట్టపై గుంత పూడ్చివేత

వెలుగోడు, జూలై 31: తెలుగుగంగలో అంతర్భాగమైన వెలుగోడు జలాశయ మట్టి కట్టపై ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి కట్ట కోతకు గురై భారీ గుంత ఏర్పడింది. పత్రికల్లో కథనాలకు ఎమ్మెల్యే బుడ్డారాజశేఖరరెడ్డి స్పందించారు. ఆయన టీడీపీ నాయకులతో తెలుగుగంగ అధికారులతో మాట్లాడి వెంటనే చర్యలు చేపట్టి గుంతను పూడ్చాలని ఆదేశించారు. ఈమేరకు టీడీపీ నాయకులు తెలుగుగంగ అధికారులు మట్టి కట్ట వద్దకు చేరుకుని మట్టి కట్టపై ఏర్పడిన గుంతను పరిశీలించారు. ట్రాక్టర్లతో మట్టిని తరలించి గుంతను పూడ్చి వేశారు. తెలుగుంగ డీఈ రమేష్, ఏఈలు ఇలియాస్, ఉదయ్, టీడీపీ నాయకులు శేషిరెడ్డి, కలాం, ఖలీల్ హిదాయత్, రసూల్, జాకీర్‌హుసేన్ సూర్యనారాయణ, అమీర్, సంజీవరాయప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'ఆయేషాబేగం సేవలు మరువలేనివి'


ఆయేషాబేగం దంపతులను సన్మానిస్తున్న వైద్య బృందం

కొత్తపల్లి, జూలై 31: గ్రామీణ ప్రాంతాల్లో పబ్లిక్ హెల్త్ నర్సు (పీహెచ్ఎన్) ఆయేషాభేగం సేవలు మరువలేనివని కొత్తపల్లి, గోకవరం, ఎర్రమఠం వైద్యాధికారులు మహ్మద్ బేగ్, విజయేంద్ర, దీపానాగవేణి, జుబేర్ అన్నారు. బుధవారం కొత్తపల్లి పీహెచ్‌సీలో పీహెచ్ఎన్ ఆయేషాభేగం పదవీ విరమణ కార్యక్రమం సీహెచ్‌వో బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. కంటి వైద్య నిపుణుడు డాక్టర్ షేక్షావలి మాట్లాడుతూ ప్రజలకు అందించిన సేవలు మాత్రమే చిరకాలంగా ఉంటాయని అన్నారు. ఆయేషాబేగం దంపతులను సన్మానించారు. సీనియర్ సూపర్‌వైజర్ మస్తానయ్య, చెరుకు రవికుమార్, సూపర్‌వైజర్లు గురప్ప, దేవ కరుణమ్మ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, బంధుమిత్రులు పాల్గొన్నారు.







'సరైన సమయంలో చికిత్స అందించాలి'


మాట్లాడుతున్న డాక్టర్ అనూష

నంద్యాల (నూనెపల్లె), జూలై 31: మహిళల్లో రక్త హీనతకు సరైన సమయంలో చికిత్స అందించాలని స్త్రీ వ్యాధినిపుణులు అనూష అన్నారు. ఐఎంఏ నంద్యాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం నంద్యాలలోని మధుమణి నర్సింగ్‌హోం సమావేశ భవనంలో నంద్యాల ప్రాంత వైద్యులకు నిరంతర వైద్య విద్య సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, స్త్రీ వ్యాధినిపుణులు అనూష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డాక్టర్ అనూష మాట్లాడుతూ రక్త హీనత ఉన్న స్త్రీలలో నీరసం, కళ్లు తిరగడం, ఆయాసం, నాడి వేగం పెరగడం, చర్మం పాలిపోయి ఉండటం లాంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఇలాంటి సమయంలో రక్తహీనతను సరి చేయకపోతే గుండె ఫెయిల్యూర్‌లోకి వెళ్లే ప్రమాదం ఉందని అన్నారు. కాన్పు తర్వాత ఐరన్ లోపం వల్ల వచ్చే రక్త హీనత చికిత్సా విధానాలపై డాక్టర్ అనూష, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ప్రాథమిక దశలో గుర్తించడం ఎలా అనే అంశంపై డాక్టర్ గీతావాణి వైద్యులకు వివరించారు. ఐఎంఏ నంద్యాలశాఖ అధ్యక్షురాలు డాక్టర్ వసుధారాణి, కార్యదర్శి డాక్టర్ అనిల్‌కుమార్, సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు, డాక్టర్ మధుసూదన్‌రావు, ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ విజయభాస్కరరెడ్డి, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఐల నియామకం

నందికొట్కూరు, జూలై 31: నందికొట్కూరు పట్టణ సీఐగా విధులు నిర్వహిస్తున్న ప్రకాష్ కుమార్‌ను వీఆర్‌కు పంపారు. పత్తికొండలో పని చేస్తున్న ప్రవీణ్ కుమార్ రెడ్డిని నందికొట్కూరు పట్టణ సీఐగా, ప్యాపిలి సీఐగా విధులు నిర్వహిస్తున్న సుధాకర్‌రెడ్డిని నందికొట్కూరు రూరల్ ఈఐగా నియమిస్తూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. సుధాకర్‌రెడ్డి గతంలో కూడా నందికొట్కూరు రూరల్ సీఐగా విధులు నిర్వహించారు.

అక్రమాలపై విచారణ


హాస్టల్‌లో విచారణ చేస్తున్న అధికారి

డోన్(రూరల్), జూలై 31: డోన్ పట్టణం మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల హాస్టల్‌లో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ఉన్నతాధికారులకు ఇచ్చిన వినతిపై బుధవారం డోన్‌లో విచారణ చేపట్టారు. నంద్యాల జిల్లా బీసీ గురుకుల కన్వీనర్ ఫ్లోరమ్మ జ్యోతిరావు పూలే బీసీ బాలికల హాస్టల్‌లో విచారణ చేశారు. విషయం తెలుసుకున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రతాప్ హాస్టల్‌లో విచారణ అధికారిని కలిసారు. ఈ సందర్భంగా సూర్యప్రతాప్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో జ్యోతిరావు పూలే బీసీ బాలికల సంక్షేమ హాస్టల్‌ను ఏర్పాటు చేశారని, అప్పటి నుంచి సీట్ల విషయంలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. దీనిపై స్పందించిన నంద్యాల జిల్లా బీసీ గురుకుల కన్వీనర్ విచారణ వివరాలు ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

బనగానపల్లె, జూలై 31: బనగానపల్లె జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాజునాయక్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి సుధాకర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజునాయక్ పసుపుల తండాకు చెందిన పలువురి నుంచి బంజరు భూములకు పట్టలిపిస్తానంటూ డబ్బు వసూలు చేశాడని బాధితుడు తిరుపతినాయక్ మరికొందరు బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావుకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసిన సీఐ ఉపాధ్యాయుడు రాజునాయక్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. బంజరు భూములకు పట్టాలు ఇప్పిస్తామని 2.70 లక్షల నగదు, ఫోన్‌పే ద్వారా డబ్బులు తీసుకున్నట్లు రుజువు కావడంతో నంద్యాల జిల్లా విద్యాధికారి రాజు నాయక్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్

దొర్నిపాడు, జూలై 31: మండలంలోని దొర్నిపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయినట్లు ఎంఈవో రామచంద్రయ్య బుధవారం తెలిపారు. ఎస్ఎంసీ సభ్యుల పునర్వ్యవస్థీకరణ కోసం నోటిఫికేషన్ జారీ చేసి ఓటరు జాబితాను గురువారం నోటీసు బోర్డులో అంటించనున్నట్లు తెలిపారు. 5వ తేదీ వరకు ఓటర్ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, ఏవైన ఫిర్యాదులు ఉంటే వాటిని పరిశీలిస్తామని చెప్పారు. 8వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుల ఎన్నికలు, మధ్యాహ్నం 1.30 గంటలకు ఎన్నికల ముగింపు, ఆ తరువాత 1.30 గంటలకు ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక నిర్వహణ, 2 గంటలకు ఎన్నికైన వారితో ప్రమాణ స్వీకరణ ఉంటుందని ఎంఈవో తెలిపారు.

చాగలమర్రి: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ కమిటీ ఎన్నికలకు విద్యాశాఖ షెడ్యూల్ ప్రకటించిందని, ఆగస్టు 1న కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్ల తెలిపారు. బుధవారం ఎమ్మార్సీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఈనెల 8న ఆయా పాఠశాలల్లో కమిటీ సభ్యుల ఎన్నిక పూర్తి చేసి అనంతరం పాఠశాల ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు.

యువత స్వయం ఉపాధితో ముందుకు సాగాలి

బనగానపల్లె, జూలై 31: యువత స్వయం ఉపాధితో ముందుకు సాగాలని మండల టీడీపీ అధ్యక్షుడు పీవీ. కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం నందవరం గ్రామంలో నిరుద్యోగ యువకులు ప్రారంభి స్తున్న భోజన శాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటన్న, టీడీపీ నాయకులు వెంగన్న, లక్ష్మిరెడ్డి, నాగోశేషారెడ్డి, చిరంజీవి రెడ్డి, శంకర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, ముధుమోహన్, వినోద్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని బీసీకి వినతి

బనగానపల్లె, జూలై 31: తమ సమస్యలు పరిష్కరించాలని వడ్డెర సంఘం నాయకులు బుధవారం టీడీపీ కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చేలా అసెంబ్లీలో తీర్మానం చేయాలని, వడ్డెర కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక రుణాలు ఇవ్వాలని, క్వారీలో పనిచేసే వడ్డెరులకు రిజర్వేషన్లు కల్పించాలని, 50ఏళ్లకే పింఛన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శిల్పి సుబ్బరాయుడు పాల్గొన్నారు.

'మినీ గోకులాలకు దరఖాస్తు చేసుకోండి'

చాగలమర్రి, జూలై 31: పాడి పశువులను పోషించుకునే రైతులు మినీ గోకులాలకు దరఖాస్తు చేసుకోవాలని పశువైద్యశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. బుధవారం చాగలమర్రి పశువైద్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మినీ గోకులాల కోసం నిధులు మంజూరు చేస్తుందని చెప్పారు. రెండు పశువుల మినీ గోకులానికి రూ.1.15 లక్షలు, నాలుగు పశువుల మినీ గోకులానికి రూ.185 లక్షలు, ఆరు పశువుల మినీ గోకులానికి రూ.2.30 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

పాఠశాల తనిఖీ

చాగలమర్రి, జూలై 31: మండలంలోని పెద్దవంగలి ప్రాథమిక పాఠశాలను ఎంఈవో అనూరాధ బుధవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీ ఖాశీం పాల్గొన్నారు.

నల్లమలలో వృక్ష సంపద పరిశీలన

రుద్రవరం, జూలై 31: నల్లమల అడవిలోని రుద్రవరం రేంజ్‌లోని వృక్ష సంపదను బుధవారం స్క్వాడ్ డీఎఫ్‌వో రామకోటిరెడ్డి పరిశీలించారు. రేంజ్‌లోని బోరింగ్ బేస్ క్యాంపు రస్తా, ఊట్ల ప్రాంతాల్లో సందర్శించి వృక్షాలను పరిశీలించారు. ఆయన వెంట రేంజర్ శ్రీపతినాయుడు, సెక్షన్ ఆఫీసరు ముక్తియార్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

చాగలమర్రి, జూలై 31: చాగలమర్రి గ్రామంలోని ఎయిడెడ్ వాసవీ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బుధవారం రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రమదానం పనులు చేశారు. ఆలయం చుట్టుపక్కల ముళ్లకంపలు, చెత్తాచెదారం తొలగించారు. కళాశాల కరస్పాండెంట్ రఘురామ్, కమిటీ సభ్యులు పుల్లారెడ్డి, శేషయ్య, ఎన్ఎస్ఎస్ అధికారి మహేశ్వరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సిమెంట్ లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు


బోల్తా పడిన లారీ

కొలిమిగుండ్ల, జూలై 31: మండలంలోని కల్వటాల గ్రామం వద్ద జాతీయ రహదారిపై సిమెంటు లారీ బోల్తా పడింది. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. జమ్మలమడుగు దాల్మియా సిమెం టు పరిశ్రమ నుంచి సిమెంట్ లోడుతో బెంగళూరు వెళ్తున్న లారీ ఎర్ర వాగుపై బ్రిడ్జి దాటుతున్న సమయంలో అదుపు తప్పి బోల్తా పడింది. తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్ వేల్ మురుగన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కల్వటాల వాసులు 108 వాహనానికి సమాచారం అందించగా, ఆయను జమ్మలమడుగు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి

డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

బేతంచెర్ల, జూలై 31: నగర పంచాయతీలోని ఆయా వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు.. బుధవారం పట్టణంలోని నగర పంచాయితీ కార్యాలయంలో కౌన్సిలర్ల సర్వసభ్య సమావేశం ఛైర్మన్ చలంరెడ్డి అధ్యక్షతన నగర పంచా యతీ కమిషనర్ రమేష్‌బాబు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ స్థలాలకు కంచె ఏర్పాటు చేస్తామని ప్రతి సమావేశంలో అధికారులు చెబుతున్నారు తప్ప ఏర్పాటు చేయడం లేదని టీడీపీ పదో వార్డు కౌన్సిలర్ రామాంజనేయులు అధికారులను ప్రశ్నించారు. అందుకు తగిన నిధులు లేనందున ఏర్పాటు చేయలేకపోయామని కమిషనర్ సమాధానమిచ్చారు. 15వ వార్డు టీడీపీ కౌన్సిలర్ నంద్యాల కుమారి మాట్లాడుతూ ముచ్చట్ల వాగు నుంచి పైపులైన్ ఏర్పాటు చేస్తామని ఇంత వరకు చేయలేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. 6వ వార్డు కౌన్సిలర్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ తమ వార్డులో డ్రైనేజీ కాలువలు అపరిశుభ్రంగా ఉన్నా పట్టించుకోవడం లేదన్నారు. 17వ వార్డు కౌన్సిలర్ ఇబ్రహీం మాట్లాడుతూ ఇళ్ల స్థలాల వెంచర్లకు నగర పంచాయతీకి రావాల్సిన పది శాతం కూడా ఇవ్వడం లేదని అధికారులను ప్రశ్నించారు. ఛైర్మన్ చలంరెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని నాలుగు కమ్యూనిటీ సామూహిక మరుగుదొడ్లకు పైపులైన్ల ద్వారా నీటి సరఫరా చేయాలని, ట్యాంకర్ల ద్వారా చేస్తే సరిపోవని ఆయన ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అలాగే బేతంచెర్ల నగర పంచాయతీ అభివృద్ధికి ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయాలని ఆయన ఎమ్మెల్యే కోట్లను కోరారు. ఈ సమావేశంలో టీడీపీ, వైసీపీ, వార్డుల కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలం బయలుదేరిన ఎమ్మెల్యే కోట్ల

డోన్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గురువారం శ్రీశైలం రానుండటంతో డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి శ్రీశైలానికి బుధవారం బయలుదేరి వెళ్లారు. నంద్యాల జిల్లాలోని శ్రీశైలంలో సీఎం చంద్రబాబు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు డోన్ ఎమ్మెల్యే కోట్ల అక్కడకు బయలుదేరి వెళ్లారు. ఆయన వెంట డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ లక్ష్మీరెడ్డి ఉన్నారు.

నంద్యాల జిల్లాకు బుడ్డా వెంగళరెడ్డి పేరు పెట్టాలి

మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి


మాట్లాడుతున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, జూలై 31: నంద్యాల జిల్లాకు రాయలసీమ దానకర్ణుడు బుడ్డా వెంగళరెడ్డి పేరు పెట్టాలని ఉమ్మడి జిల్లాల టెలికాం మాజీ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు, బనగానపల్లె మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం బనగానపల్లె పట్టణంలోని బీసీ రాజారెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1866లో రాయలసీమకు డొక్కల కరువు సంభవించినప్పుడు పేద ప్రజల ఆకలి తీర్చడానికి వెంగళరెడ్డి చేసిన కృషి చరిత్రలో నిలిచిపోయిందని అన్నారు. రాయలసీమ అన్నదాతగా పేరొందిన బుడ్డా వెంగళరెడ్డి పేరును నంద్యాల జిల్లాకు నామకరణం చేయాలని కోరారు.

'చంద్రబాబును గుర్తుంచుకోవాలి'

రుద్రవరం, జూలై 31: పింఛనుదారులు ప్రతి ఒక్కరూ చంద్రబాబును గుర్తు పెట్టుకోవాలని ఆటో యాత్రికుడు అబ్దుల్ గప్పార్ సూచించారు. మండలంలోని నరసాపురం, చిత్తరేణిపల్లె గ్రామాల్లో ఆటోయాత్ర నిర్వహించారు.

మొక్కజొన్న పంటపై అడవి పందుల దాడి


దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో రంగనేతాజీ

చాగలమర్రి, జూలై 31: మండలంలోని చింతలచెరువు గ్రామంలో అడవి పందుల దాడితో మొక్కజొన్న పంట బుధవారం దెబ్బతింది. మూడెకరాల మొక్కజొన్న పంటను పందులు రాత్రి వేళల్లో వచ్చి ధ్వంసం చేశాయని సుబ్బరాయుడు అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలల పాటు పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చానని, పంట చేతి కొచ్చే సమయంలో అడవి పందుల దాడి వల్ల నష్టపోయానని అన్నారు. దాదాపు రూ.లక్ష దాకా పంటకు పెట్టుబడి పెట్టి సాగు చేశానన్నారు. కంకులు వచ్చే సమయంలో పలు చోట్ల మొక్కజొన్న కంకులను విరిచి దెబ్బతీశాయని రైతు విలపించారు. ఏవో రంగనేతాజీ, వీహెచ్ఏ దేవేంద్ర మొక్కజొన్న పంటను పరిశీలించారు. పలు చోట్ల దెబ్బతిన్న మొక్కజొన్నను పరిశీలించి జరిగిన నష్టం గురించి రైతును అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న పంటకు నష్టం అంచనా వేసి పరిహారం కోసం ప్రతిపాదిస్తామన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

ఉయ్యాలవాడ, జూలై 31: మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం ఉదయం 6గంటల నుంచి పింఛన్ల పంపిణీని ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో రఘురాం బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సాయంత్రం 6గంటల కల్లా వంద శాతం పింఛన్లు పంపిణీ చేసేలా చర్యలు చేపడతున్నామన్నారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

కోవెలకుంట్ల: గ్రామాల్లోని పింఛన్‌దారులకు ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని ఈవోఆర్డీ రాధికారెడ్డి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ గురువారం సచివాలయ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉదయం 6గంటల నుంచి సాయంత్రంలోపు పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలన్నారు.

సంజామల: పింఛన్లను వంద శాతం పంపిణీ చేయాలని ఎంపీడీవో విజయ్ కుమార్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఉదయం 6గంటల నుంచి ఆయా గ్రామాల్లో ఉండి ఇంటింటికీ తిరిగి పింఛన్ పంపిణీ చేపట్టాలన్నారు.

ఆళ్లగడ్డ: మండలంలోని పింఛన్‌దారులు సచివాలయ సిబ్బందికి అందుబాటులో ఉండాలని ఎంపీడీవో రమణారెడ్డి సూచించారు. సచివాలయాల సిబ్బంది గురువారం ఇళ్ల వద్దకు వచ్చి పింఛన్ ఇస్తారని చెప్పారు.

మానవత్వం చాటుకున్న సర్పంచ్

డోన్, జూలై 31: విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించి బొంతిరాళ్ల సర్పంచ్, న్యాయవాది రవి మోహన్ మానవత్వం చాటుకున్నారు. పట్టణంలోని జాతీయ రహదారి నుంచి కిలోమీటరు దూరంలో వివిధ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలున్నాయి. రహదారికిరు వైపులా కంప చెట్లు పెరగడంతో అటుగా వెళ్లే విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను గుర్తించిన సర్పంచ్ రవి మోహన్ బుధవారం ఉదయం ఎక్స్‌కవేటర్‌తో రహదారికిరువైపులా కంప చెట్లను తొలగించారు.

ధైర్యంగా ఉండండి: ఎమ్మెల్యే

డోన్, జూలై 31: బ్యాంకాక్‌లో కిడ్నాప్‌కు గురైన యువకుడు మధుకుమార్‌ను క్షేమంగా రప్పిస్తామని, ధైర్యంగా ఉండాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం మధుకుమార్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే కోట్ల పరామర్శించారు. బ్యాంకాక్‌లో కిడ్నాప్‌కు గురైన మధుకుమార్‌ను క్షేమంగా తీసుకువచ్చేందుకు పోలీసులు అన్ని చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎస్పీతో మాట్లాడామని కుటుంబ సభ్యులకు వివరించారు. ఎమ్మెల్యే కోట్ల వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ లక్ష్మీరెడ్డి, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్ తదితరులు ఉన్నారు.

బాబు జగ్జీవన్‌రావు విగ్రహం ఏర్పాటు చేయాలి

డోన్(రూరల్), జూలై 31: డోన్ పట్టణంలో దివంగత బాబు జగ్జీవన్ రావు విగ్రహం ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు గుండాల ఈశ్వరయ్య మాదిగ కోరారు. బుధవారం డోన్‌లో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని కలిసి వినతి పత్రం అంద జేశారు. ఈసందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రావు స్మారక భవనం విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత ఉప ప్రధానిగా కీలకంగా పని చేసిన బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి ఎన్నో సేవలు అందించారన్నారు.

అసిస్టెంట్ లైన్‌మెన్‌పై దాడి : కేసు నమోదు

సంజామల, జూలై 31: నొస్సం గ్రామానికి చెందిన అసిస్టెంట్ లైన్‌మెన్‌పై గ్రామస్థులు నడిపి సుబ్బరాయుడు, పెద్ద నరసింహుడు దాడి చేశారు. అసిస్టెంట్ లైన్‌మెన్ మహబూబ్ బాషా, వెంకటరమణ, ప్రభాకరావు, సంజీవ్ కుమార్ సహ ఉద్యోగులతో కలిసి నొస్సం గ్రామంలోని చాకలి బజార్‌లో కరెంటు బిల్లులు వసూలు చేస్తుండగా అదే బజారులో ఉన్న నడిపి సుబ్బరాయుడు, పెద్ద నరసింహుడు బిల్లులు కట్టం ఏమి చేసుకుంటారో చేసుకోండి అంటూ వాగ్వాదానికి దిగి దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో మహబూబ్ బాషా గాయాలకు గురవ్వడంతో నొస్సం అవుకు పోస్టు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో హెడ్‌కానిస్టేబుల్ నాగన్న కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముదిగేడులో దంపతులపై దాడి

సంజామల, జూలై 31: ముదిగేడు గ్రామానికి చెందిన చందన, నరేష్ భార్యా భర్తలపై అదే గ్రామానికి చెందిన హుసేనమ్మ, దస్తగిరి, పవన్ కళ్యాన్, నస్రీన్, పాపన్న దాడి చేశారని బాధితులు బుధవారం సంజామల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎ.ఎస్.ఐ నాగరాజు తెలిపారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

బేతంచెర్ల, జూలై 31: నగర పంచాయతీ పరిధిలోని బుగ్గానిపల్లి గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరుకుంటూ జీవిస్తున్న ముంతాజ్ (32) అనే అనాథ మహిళ క్షయ వ్యాధితో బుధవారం మృతి చెందిం ది. మృతురాలికి సమీప బంధువులు ఎవరూ లేనందున స్థానికులు మృతురాలి అంత్యక్రియలు నిర్వహించాలని ఆ నలుగురు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వన్నూరు బాషాని కోరారు. ఆయన సంస్థ సభ్యులతో కలిసి బేతంచెర్ల ముస్లిం శ్మశాన వాటికలో ఇస్లాం మత ఆచారాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహిం చారు. కార్యక్ర మంలో సభ్యులు నాగేశ్వరరెడ్డి, లక్ష్మిరాఘవ, అక్బర్, వెంకటేశ్వర్లు, సద్దాం, యూసుఫ్ పాల్గొన్నారు.

45 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడా?

ఎంఈవోను ప్రశ్నించిన ఎంపీటీసీ, సర్పంచ్


ఎంఈవోను ప్రశ్నిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

ఉయ్యాలవాడ, జూలై 31: తమ గ్రామ పాఠశాలలో 45 మంది విద్యార్థులుంటే ఒకే ఒక ఉపాధ్యాయుడా? అని ఆర్.జంబులదిన్నె గ్రామ సర్పంచ్ ప్రసాద్, ఎంపీటీసీ బాలిరెడ్డి ఎంఈవో ప్రతాప్‌రెడ్డిని ప్రశ్నించారు. ఉయ్యాలవాడ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ బుడ్డ భాగ్యమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు వారి వారి ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సర్పంచ్ ప్రసాద్, ఎంపీటీసీ బాలిరెడ్డి మాట్లాడుతూ ఒక ఉపాధ్యాయుడితో మెరుగైన విద్యను ఎలా అందిస్తారని ఎంఈవోను ప్రశ్నించారు. మాయలూరు గ్రామ బీసీ కాలనీలో వర్షం నీరు వెళ్లే మార్గం లేక కాలనీలోని ఇళ్ల చుట్టూ వర్షం నీరంతా చేరి దుర్వాసన వెదజల్లుతోందని దానిని బయటకు మళ్లించే మార్గంగా ఆర్అండ్‌బీ రోడ్డులో కల్వర్టు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డిని గ్రామ కార్యదర్శి రమేశ్ కోరారు. మండలంలో 20 గ్రామాలు ఉంటే కేవలం 25 మినీ గోకులాలు మంజూరు కావడంపై నర్సుపల్లె గ్రామ సర్పంచ్ గురుప్రసాద్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. మండలంలో పాడి రైతులు ఎక్కువగా ఉన్నందున మినీ గోకులం యూనిట్ల సంఖ్య పెంచాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. మండంలో పండ్లతోటల సాగుకు రైతులు ముందుకు వచ్చేలా గ్రామ సర్పంచ్‌లు చొరవ చూపాలని హార్టికల్చర్ అధికారి ధరణి కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘురాం, ఈవోపీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, అధికారులు, సర్పం చ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం: కోట్ల సుజాతమ్మ


బాధితుడితో మాట్లాడుతున్న కోట్ల సుజాతమ్మ

ప్యాపిలి, జూలై 31: టీడీపీ కార్యకర్తల జోలికొస్తే ఊరుకోమని మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. ఇటీవల పోతుదొడ్డి గ్రామంలో వైసీపీ వర్గీయుల దాడిలో గాయపడిన టీడీపీ నాయకుడు నారాయణను బుధవారం సుజాతమ్మ పోతుదొడ్డిలోని ఆయన నివాసంలో పరామర్శించారు. వైసీపీ బెదిరింపులకు భయపడవద్దని..తాము అండగా ఉంటామని ఆయనకు భరోసా ఇచ్చారు. అనంతరం సుజాతమ్మ మాట్లాడుతూ వైసీపీ దాడుల సంస్కృతిని మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందని సుజాతమ్మ హెచ్చ రించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావు యాదవ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

అవుకు, జూలై 31: ప్రకృతి వ్యవసాయం లాభదాయకంగా ఉంటుం దని నంద్యాల ప్రకృతి వ్యవసాయ అధికారి రామకృష్ణ అన్నారు. బుధ వారం అవుకు పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఎంపీడీవో మల్‌రెడ్డి, ఎంఈవో శ్రీధర్‌రావు, వెలుగు ఏపీఎం విజయగోపాల్‌తో కలసి పొదుపు సంఘాల మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. రామకృష్ణ మాట్లాడుతూ పంటల సాగులో విత్తనాల ఎంపిక కీలకమన్నారు. ఎంపీడీవో మల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో అంతర్ పంటలను సాగుచేస్తే మంచి లాభాలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవ సాయ ట్రైనర్ సుబ్బరాయుడు, యూనిట్ ఇన్‌చార్జి పేరిరాజు, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

'పింఛన్ పంపిణీలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు'

రుద్రవరం, జూలై 31: మండలంలో 16 సచివాలయాలు, 21 గ్రామ పంచాయతీల పరిధిలో ఒక్కరోజులోనే 98 శాతం పింఛన్ల పంపిణీ చేయాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో రామచంద్ర హెచ్చరించారు. మండల పరిషత్‌లో సచివాలయ ఉద్యోగులు గ్రామ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ, ఏవో వరలక్ష్మి ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సాయం మరువలేనిది

సంజామల, జూలై 31: పేరుసోమల జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సాయం మరువలేనిదని హెచ్ఎం సీతారావమ్మ అన్నారు. 1983-1984 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పేరుసోమల జడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు పాఠశాలలో రూ. 1.50 లక్షలు వెచ్చించి వేదికను నిర్మించి హెచ్ఎంతో బుధవారం ప్రారం భోత్సవం చేయించారు. హెచ్ఎం మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు పాఠశాల అభివృద్ధికి తోడ్పాటును అందించాలని కోరారు. సైన్స్ ఉపాధ్యాయుడు మేడా హరిప్రసాద్ పాల్గొన్నారు.

'ఉద్యోగులకు పదవీ విరమణ సహజం'

నంద్యాల, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని ఆళ్లగడ్డ పోస్టల్ ఇన్స్పెక్టర్ రామనాథ్ అన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలోని పోస్టాఫీసులో ప్యాకర్‌గా చేస్తున్న అవుకు ఇస్మాయేల్ బుధవారం పదవీ విరమణ చేశారు. పోస్టల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆయనను ఆళ్లగడ్డ పోస్టల్ సబ్ డివిజన్‌లోని బీపీఎంలు, ఏబీపీఎంలు, పోస్టుమాస్టర్లు, సిబ్బంది సత్కరించారు. పోస్ట్‌మాస్టర్లు రంజిత్ నాయక్, ఓబులేసు, విశ్రాంత పోస్ట్‌మాస్టర్ సూర్యనారాయణరెడ్డి, మైల్ వర్సర్స్ భాస్కరరావు, పెద్దరాజు, జనార్ధనరెడ్డి పాల్గొన్నారు.

అధికారుల మధ్య కొరవడిన సమన్వయం?

అప్‌డేట్ కాని రికార్డులు


రుద్రవరం సచివాలయం

రుద్రవరం, జూలై 31: రుద్రవరం సచివాలయ పరిధిలో అధికారుల మధ్య సమన్వయం కొరవడినట్లు తెలుస్తోంది. సచివాలయాల్లో రికార్డులు నాలుగు నెలల నుంచి అప్‌డేట్‌గా లేవు. అన్ని రికార్డులు అలాగే ఉన్నాయి. ఈవోపీఆర్డీ తనిఖీ చేసిన సందర్భంలో బయటపడ్డాయి.

డీపీవో దృష్టికి తీసుకెళ్లా

జిల్లా పంచాయతీ అధికారిణి మంజులవాణి దృష్టికి రుద్రవరం సచివాలయం అంశాన్ని తీసుకెళ్లా. సచివాలయంలో నాలుగు నెలల నుంచి రికార్డులు అప్‌డేట్‌గా లేవు. ఈవో సుబ్బారావు, జూనియర్ అసిస్టెంటు చెన్న య్యలు ఇద్దరి మధ్య సయోధ్య లేకపోవడంతో రికార్డుల్లో రికార్డు చేయలేదని డీపీవో దృష్టికి తీసుకెళ్లా.

- శ్రీనివాసశర్మ, ఈవోపీఆర్డీ

15న అన్న క్యాంటీన్లు పునఃప్రారంభం


అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

డోన్, జూలై 31: సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఆగస్టు 15 నుంచి డోన్ పట్టణంలో అన్నా క్యాంటీన్లు పునఃప్రారంభిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డా.జయరాం తెలిపారు. బుధవారం పట్టణం లోని మధు ఫంక్షన్ హాలు సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్ భవనాన్ని కమిషనర్ పరిశీలించారు. అన్న క్యాంటీన్‌లో ఉన్న సచివాలయాన్ని ఖాళీ చేయించి వేరే భవనంలోకి మార్చారు. మున్సిపల్ సిబ్బందితో అన్న క్యాంటీన్‌ను శుభ్రం చేయించారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి చేతుల మీదుగా అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్నామని, రూ.5లకే ఉదయం టిఫిన్, మధ్యా హ్నం భోజనం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

బేతంచెర్ల సీఐగా వెంకటేశ్వరరావు

బేతంచెర్ల, జూలై 31: బేతంచెర్ల యూపీఎస్ పోలీస్‌స్టేషన్ సీఐగా వెంకటేశ్వరరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. బేతం చెర్ల పోలీస్‌స్టేషన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న ప్రియతమ్ రెడ్డిని వీఆర్ఎస్పీ రిపోర్టు చేసుకోవాల్సిందిగా ఉత్తర్వులు వచ్చాయి. నంద్యాల ఎస్‌బీఐ టూ నుంచి బేతంచెర్ల పోలీస్‌స్టేషన్ సీఐగా డి.వెంకటేశ్వర రావును నియమించినట్లు ఉత్తర్వులు పోలీసు ఉన్నతాధికారులు జారీ చేశారు.

ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతానికి కృషి

కొలిమిగుండ్ల, జూలై 31: ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కొలిమిగుండ్ల ఇన్‌చార్జి తహసీల్దార్ నాగేశ్వరరెడ్డి వెల్లడించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతానికి రేషన్ డీలర్లు, కార్డుదారుల అభిప్రాయాలను ప్రభుత్వం సేకరిస్తోందని అన్నారు.

తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలి

ప్యాపిలి, జూలై 31: మండలంలో తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయాలని వైద్యాధికారి వాణిశ్రీ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి 7 వరకు ఈ తల్లి పాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

చురుగ్గా సాగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు

కొలిమిగుండ్ల, జూలై 31: మండలంలోని గుండం అంజనేయస్వామి ఆలయం నుండి నూతనంగా నిర్మించిన పట్టాభిరామ ఆలయానికి మధ్య కోన వంకపై ఏర్పాటు చేస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నట్లు ఆలయాల కమిటీ సభ్యులు వెల్లడించారు. బుధవారం బ్రిడ్జి నిర్మాణానికి సహకరిస్తున్న పెన్నా సిమెంట్ అధికారులు పనులను పరిశీలించారు. కొండయ్యగౌడు, చిన్నమాబు, లక్ష్మీనారాయణరెడ్డి, చంద్ర పాల్గొన్నారు.

ప్రజా పంపిణీపై సర్వే

నంద్యాల, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థపై సర్వే చేయాలన్న కమిషనర్ ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ మున్సిపాలిటీలోని పి.చింతకుంటలో బుధవారం సర్వే చేసినట్లు ఆళ్లగడ్డ సీఎస్‌డీటీ శేఖర్‌రెడ్డి తెలిపారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీలోని రేషన్ కార్డుదారులతో దేవరాయపురం, ఆళ్లగడ్డ గ్రామాల్లో ప్రస్తుతం నడుస్తున్న ప్రజా పంపిణీ ఎలా ఉంది? ఎలా ఉండాలనుకున్నారు? అనే అంశాలపై కార్డుదారులతో మాట్లాడి నివేదిక సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు.

సమాజాభివృద్ధిలో అధ్యాపకుల పాత్ర విశేషం

బనగానపల్లె , జూలై 31: సమాజాభివృద్ధిలో అధ్యాపకుల పాత్ర గొప్పదని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అన్నారు. బుధవారం రామకృష్ణ విద్యాసంస్థల ఛైర్మన్ రామకృష్ణారెడ్డి సతీమణి బనగానపల్లె డిగ్రీ కళాశాల వ్యాయామ ఉపాధ్యాయురాలిగా పదవీ విరమణ చేసిన సందర్భంగా ఆమెను అధ్యాపకులు సత్కరించారు.

నిధులు మంజూరు

ఉయ్యాలవాడ, జూలై 31: ఎస్సీ ఎస్టీ గ్రూపు సంఘం సభ్యులకు ఉన్నతి పథకం ద్వారా రూ.16లక్షలు రుణాలు అందిస్తున్నట్లు వెలుగు ఏపీఎం దాసన్న బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ మహిళల్లో ఓడీ లేని సంఘాలకు వడ్డీ లేని రుణాలను అందిస్తున్నామన్నారు. మండలంలో 17 సంఘాలకు 32 మందికి ఈ రుణాలు అందిస్తున్నామన్నా రు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

సంజామల, జూలై 31: ఈనెల 31న జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం వాయిదా వేసినట్లు ఎంపీడీవో విజయ్ కుమార్ రెడ్డి బుధవారం తెలిపారు. రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అనివార్య కారణాలతో అందుబాటులో లేకపోవడంతో మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేశామని తెలిపారు.